# కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు



నందిన్నె గ్రామస్తులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- రాజకీయ పబ్బం గడుపుకొనేందుకు ప్రతిపక్షాల ఆరాటం
- వారిని నమ్మితే నట్టేట ముంచుతారు
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

గద్వాల, అక్టోబర్ 12 : పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేటిదొడ్డి మండలం లోని కొండాపురం గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బోయ రామప్పగోవిందు, వడ్డెగోవిందు, ఆంజనేయులు, నందిన్నెకు చెందిన రాజన్ గౌడ్, మల్లికార్జున్, హుస్సేన్, దేవేందర్, హరీశ్, రఘుతోపాటు మరో 20మంది పార్టీలో చేరగా, ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని చేపట్టిన అభివృద్ధిని చూసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఆకాంక్షతో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు. త్వరలో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామాల్లోని బీఆర్ఎస్ కార్యకర్తలు సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో కొందరు స్వార్థ రాజకీయం కోసం ఓట్లు అడగడానికి వస్తారని, వారిని నమ్మితే నట్టేట ముంచుతారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. లేదంటే పదేండ్లలో సాధించిన అభివృద్ధి మళ్లీ 70 ఏండ్లు దూరం చేస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామకృష్ణ, నాయకులు చక్రధర్ రావు, శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రంగస్వామి, రాజు, వాసు, పవన్‌రెడ్డి, రాజేశ్, తిమ్మారెడ్డి, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేయొద్దు

- అక్రమ మద్యం, డబ్బు రవాణాపై ప్రత్యేక నిఘా
- ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమావేశానికి హాజరైన అధికారులు

గద్వాల, అక్టోబర్ 12 : అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటికల్ సర్విలేయన్స్, వీడియో వీవింగ్ బృందాలతో సమావేశం నిర్వహించి ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ 9న విడుదల అయినందునా అప్పటి నుంచి డిసెంబర్ 5వరకు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నిబంధనలు అమల్లో ఉండనున్న నేపథ్యంలో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో అమలుపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. మోడల్ కోడ్‌ఆఫ్ కండక్ట్ నిబంధనలు, ఇతర అధికారుల బాధ్యతలు గుర్తుచేశారు. ఎన్నికల నియమావళి ప్రతిఒక్కరికీ వర్తిస్తుందని, ఎవరికీ మినహాయింపు లేదని చెప్పారు. జిల్లాలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు ఏర్పాటు చేశామని, నిరంతరం పర్యవేక్షణ చేస్తుంటారని తెలిపారు. జిల్లాలోని నలుమూలల చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అక్రమంగా మద్యం, డబ్బు సరఫరా, ప్రలోభాలు, బహుమతుల వంటివాటిని పకడ్బందీగా నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. సీ-విజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ, కంట్రోల్ రూంకు ఫిర్యాదులు వస్తే 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకునేలా సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక ప్రదేశాలకు ఫ్లయింగ్ స్క్వాడ్స్ టీంలు సకాలంలో చేరుకోలేకపోతే కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

***అప్రమత్తంగా ఉండాలి..***

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా రాజకీయపార్టీల అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల 100 మీటర్లలోపు ఎటువంటి ప్రచారం నిర్వహించరాదని చెప్పారు. పోలింగ్‌కు 48గంటల ముందు ఎలాంటి ప్రచారం నిర్వహించరాదని, నవంబర్ 28వ తేదీ ఉదయం 5గంటల్లోపు ప్రచారం నిలిపివేయాలని ఆదేశించారు. అభ్యర్థులు నామినేషన్ వేసినప్పటి నుంచి ఫలితాలు వచ్చే వరకు ఖర్చు చేసిన వివరాలు 30రోజుల్లో ఎన్నికల అధికారికి అందజేయాలని, లేనిపక్షంలో అభ్యర్థి అనర్హతకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు ప్రచారం కోసం వాడే వాహనాలకు అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులను వంద నిమిషాల్లో సమస్యను ఛేదించి పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ఓటర్లు ఎవరైనా ఎన్నికలపై తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి 1950 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఆధారాలు లేకుండా రూ.50వేల కన్నా అధికంగా రవానా చేస్తున్నట్లు గుర్తిస్తే సీజ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. రూ.10లక్షల వరకు సరైన ఆధారాలు ఉంటే సీజ్ చేయరని, ఇన్‌కం టాక్స్ వారికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఎక్కువ విలువగల వస్తువులు ఉన్న వీడియో, సీసీటీవీ వాయిస్ రికార్డు కవరేజ్ చేస్తూ సీజ్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల స్టార్ క్యాంపెయిన్ వద్ద పార్టీ కార్యకలాపాల కోసం రసీదుతో కూడిన రూ.లక్ష వరకు అనుమతి ఉందన్నారు. ఎన్నికల నియమావళికి సంబంధించి ప్రతి రోజూ నివేదికలు పంపేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, శ్రీనివాసులు, ఆర్డీవో చంద్రకళ, ఇన్‌చార్జి ఎస్పీ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఫాం-12 అందజేయాలి..

జిల్లాలో 80ఏండ్లు పూర్తయిన ఓటర్లకు ఫాం-12 అంజేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి తాసీల్దార్లను ఆదేశించారు. గురువారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ సమావేశ హాల్‌లో అన్ని మండలాల తాసీల్దారలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 80ఏండ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు అత్యవసర వైద్యం పొందుతున్న ఓటర్ల జాబితాను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వారి ఇంటికి బీఎల్‌వో వెళ్లి పరిశీలించాలని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఫాం-12 అందజేయాలన్నారు. అక్టోబర్ 31వరకు నూతన ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. పోలింగ్ రోజు విధుల్లో ఉన్న అధికారులకు వారం రోజుల ముందుగా పోస్టల్ బ్యాలెట్ కవర్లను అంజేయాలన్నారు.

# బాలబ్రహ్మేశ్వర ఆలయంలో పవిత్రోత్సవం



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న అర్చకులు

అలంపూర్, అక్టోబర్ 12 : అలంపూర్ క్షేత్రంలో ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించబోయే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో గురువారం పవిత్రోత్సవం నిర్వహించారు గురువారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఆలయాలు మూసివేసి, ఆలయ శుద్ధి నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఆలయ ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రచార రథం రెడీ

ముస్తాబైన 'కారు'



ఉండవెల్లి క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న ఎన్నికల ప్రచారరథం

ఉండవెల్లి, అక్టోబర్ 12 : అలంపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే అబ్రహం ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచార రథాన్ని సిద్ధం చేశారు. ప్రచార రథానికి ప్రత్యేకంగా తయారు చేయించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే అబ్రహం, కారు గుర్తు ఫొటోలతో ఆకర్షణీయంగా ఉన్నది. ఆర్టీవో, ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచారరథానికి 10 ఎల్ఈడీ లైట్లు, ఆరు మైక్‌లు, జనరేటర్, సమావేశాల్లో మాట్లాడేందుకు స్టేజీ, డీజే సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి ప్రచార రథం చేరుకోవడంతో కార్యకర్తలు నూతన ఉత్సాహంతో సందడి చేశారు.

# గద్వాల ఎస్పీ సృజన బదిలీ

గద్వాల అర్బన్, అక్టోబర్ 12 : ఎస్పీ కె.సృజన ఆకస్మికంగా బదిలీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కమిషనర్లు, కలెక్టర్లు, ఎస్పీల బదిలీల పక్రియ చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగానే గద్వాల ఎస్పీ సృజనను బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి ఎస్పీగా జిల్లా అదనపు ఎస్పీ రవి గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు.

# సాహిత్యం విలువలు నేర్పుతుంది

- కవి, రచయిత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి




మాట్లాడుతున్న నందిని సిద్ధారెడ్డి

గద్వాలటౌన్, అక్టోబర్ 12 : సాహిత్యం సంస్కృతి, సంస్కారంతోపాటు విలువలను నేర్పుతుందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు, కవి, రచయిత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సాహిత్యం, వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయనతోపాటు ఆచార్య చెన్నకేశవరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్‌బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిత్వ వికాసం ఇంటి నుంచి మొదలై పాఠశాల చదువుతో పెంపుతుందన్నారు. ప్రస్తుతం మానవత్వం, మానవ సంబంధాలు, వ్యక్తిత్వ వికాసం అణగారి పోయాయన్నారు. ప్రతిఒక్కరూ సాహిత్యంపై కనీస అవగాహన కలిగి ఉండాల్సిన అవసరమున్నని, అప్పుడే వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందన్నారు. విలువల ప్రాధాన్యత తెలియని చదువులు వృథా అన్నారు. మంచి, చెడులతోపాటు జీవితాన్ని సాహిత్యం నేర్పుతుందన్నారు. సాహిత్యం సకల శాస్త్రాల సమ్మేళన భావమన్నారు. సమాజ చైతన్యంలో కవిత్వం ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో మంచి సాహిత్యకారులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, శ్రీపతినాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# టీబీ డ్యాంకు తగ్గుతున్న వరద

అయిజ, అక్టోబర్ 12 : కర్ణాటకలోని టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గుతోంది. గురువారం 180 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 9,049 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కాగా, డ్యాంలో ప్రస్తుతం 48.627 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1,633 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి గాను, ప్రస్తుతం 1615.09 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 165 క్యూసెక్కులు నమోదైనట్లు కర్ణాటక ఆర్డీఎస్ డీఈ శాంతరాజు తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 5.6 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు డీఈ పేర్కొన్నారు.